
# స్నేహసౌరభాలు



మధురమైన స్నేహసౌరభాన్ని అందించవలసిన మిత్రులే మాయమాటలు చెప్పి స్వార్ధ చింతనతో నీతి, నిజాయితీ మరిచిపోయి, మానవతా విలువలకు తిలోదకాలిస్తూ కపటనాటకాలాడుతుంటే నిజమైన స్నేహానికి అర్ధం, పరమార్ధం వుందా అనిపిస్తుంది.

కష్టాల్లో, నష్టాల్లో ఆదుకొని, ఆదరించి, ఆప్యాయంగా నేనున్నాననే వాడున్నాడనుకుంటే పొరపాటే. కష్టాల పాల్జేసేవాడు కూడా స్నేహితుడేనా అని బాధగా నిట్టూర్పు విడిచిన వాళ్ళల్లో ప్రకాష్ ఒకడు.

పాపం ప్రకాష్ జాతకం ఏంటోగాని మొదట్నుంచి ప్రాణపదంగా చూసుకున్న స్నేహితులందరూ, ఎప్పుడో, ఏదోవిధంగా ప్రకాష్ బలహీనతల మీద ఎదురుదెబ్బతీస్తూనే వున్నారు. అమాయకంగా దగాపడి మోసపోతూనే వున్నాడు. అలాంటిదేదో మరొకటి జరక్కపోతే ప్రకాష్ మళ్ళీ యింత పొద్దున్నే మిత్రుడు సంజీవిని వెతుక్కుంటూ

రావడంలో కారణంఏముంటుంది.

ఈ నిత్య జీవన గమనంలో స్థిరపడ్డాక యాంత్రిక జీవనానికి అలవాటుపడ్డాక 'సంజీవి'కి ప్రకాష్, శ్రీను, బాలాజీ స్నేహితులుగా మెలగసాగారు. రాత్రి, పగలు కలసి తిరిగిన రోజులున్నాయి. ఒకరింట్లో వొకరు పుష్టిగా భోజనాలు చేస్తూ నాకు నువ్వు, నీకునేను అనుకొని చేతిలో చేయి వేసుకునే సంఘటనలెన్నో వున్నాయి. యింకాస్త ముందుకెళ్తే ఓ ఫైనాన్స్‌కంపెనీలో కలసికట్టుగా పార్ట్‌టైంగా పనిచేస్తూ తృణమో ఫణమో వెసుకేసుకున్నారు.

చెప్పుకోవాలంటే ఒకమారు, ఎవరి కష్టార్జితం వారిదే అన్నట్లు నల్గురికీ చెరో లక్ష కమీషన్ రూపంగా చేతికొచ్చింది. సరిగ్గా అప్పుడే ఓ రియల్ ఎస్టేట్ ఏజెంట్ తారసపడ్డాడు. బాలాజీ అందరిలా కాస్త చురుకైన వాడు. అప్పటికప్పుడు ఓ మెరుపులాంటి ఆలోచన అందరిలో రేకెత్తించాడు. పట్నం పొలిమేరల్లో రెండొందల గజాల ప్లాట్స్ లక్షకే దొరుకుతుంటే అదొక అదృష్టంగా భావించమన్నాడు. పారిశ్రామికంగా పట్నాలు పెద్దవై, నివాసాలు ఇరుకైపోతున్న తరుణంలో బాలాజీ అన్నదాంట్లో తప్పేం కనపడలేదు. అయితే సంజీవి మాత్రం వెనక్కి తగ్గాడు. తనకు ఎటూ సరిపోని జీతభత్యాలు, ఇంట్లో, ఒంట్లో ఎప్పుడూ వున్న బాధలే, నిరుద్యోగ సమస్యలే, నిత్యపోరాటాలే, తనవరకు కుదరదన్నాడు. ప్రకాష్‌కి తండ్రి యిచ్చిన ఆస్తి, ఓ చిన్న పోర్షన్ డాబా ఇల్లుంది. పిల్లల చదువులకి, లేనిపోని జబ్బులకి చేసిన అప్పులున్నాయి. ఆస్తులు సంపాదించుకోవాలనే ఆశ వున్నా, అవకాశాలే గగనం.

బాలాజీ, శ్రీను తప్పక ఆ ప్లాట్స్ తీసుకోవాలని ఉవ్విళ్ళూరారు. అప్పటికే చేతికందిన లక్ష దుబారాతో ఖర్చులకి సమర్పించేసారు. అయినా ఇద్దరు ప్లాట్స్ కోసం మొగ్గుచూపడంతో ప్రకాష్‌కి మనసులాగింది. కష్టార్జితం, అదన్నా మిగులుతుందన్న తీరని కోరికతో బయలుదేరాడు. సంజీవ్‌కూడా తోడుగా వెళ్ళాడు.

పట్నం శివార్లలో వున్న పంటపొలాల్లో వుందది. ఆ జాగా బాగానే నచ్చింది. రోడ్డుకి రెండువందల అడుగుల దూరంలో పెద్ద గెడ్డ పక్కనుంది. ఎంతో తర్ఫీదు పొందిన రియల్ ఎస్టేట్ ఏజెంట్ తన తెలివితేటలతో ఎన్నో ఆశలు చూపించాడు. ముందు ముందు ఆగెడ్డ మూసేస్తే ఆ స్థలం కూడా ఆక్రమించుకోవచ్చునన్నాడు.

" మంచి డిమాండ్ వున్న ఏరియాలో వుంది. ప్లాట్ ఒక్కటే పది లక్షలు ధర పలుకుతోంది. మీక్కావాలంటే ఒకటే షరతు. మూడింటికి అడ్వాన్సు ఇచ్చారంటే, కొంత తగ్గించే ఏర్పాటు

చేస్తాను, మీ యిష్టం, అని ఎంతోచాకచక్యంగా డిస్కౌంట్ ఎర వేసాడు ఏజెంట్. దాంతో అందరి ముఖాలు వికసించాయి.

బాలాజీ, శ్రీను ఇద్దరూ గుసగుసలాడుకొని అన్నారు " మరీ అంత అర్జంటుగా క్యాష్ తెమ్మంటే ఎలా?" ప్రశ్నార్థకంగా చూసారు.

ప్రకాష్ మనసు తెగ ఆరాట పడింది. జీవితంలో తనింత తొందరగా ఓ ఇంటి స్థలం కొనగలిగే ఛాన్స్ వస్తుందనుకోలేదు. ఈ అవకాశాన్ని ఎంతమాత్రం జారవిడుచుకోకూడదనుకున్నాడు.

"మరయితే నా ప్లాట్‌కి పూర్తి పేమెంట్ చేసేస్తాను, బ్యాంకులో డబ్బుంది." అన్నాడు. ఎంతో హుషారుగా ప్రకాష్.

"ఒక్కరికైతే కుదరదు, మూడింటికి అడ్వాన్సు యిస్తేనే రిజర్వ్ చేసేది. లేకపోతే డ్రాప్ అయిపోండి." అంటూ ఏజెంట్ పాయింట్ బ్లాంక్‌గా చెప్పేసాడు.

"ప్రకాష్ రెడీ అంటున్నాడు., మీరిద్దరూ అడ్వాన్స్ పే చేస్తే సరిపోతుంది కదా " అంటూ సంజీవ తనవంతు ఉచిత సలహాయిచ్చాడు. దానికి బదులుగా ఇద్దరూ కలిసి ఓమాటచెప్పారు. "ప్రకాష్, నీదగ్గరున్న లక్షా ముగ్గురికీ అడ్వాన్సురూపంలో కట్టేసేయ్, ఆ తరువాత ఎడ్జెస్ట్ చేసుకుందాం. సరేనా" అని యుక్తిగా పలికారిద్దరూ.

ప్రకాష్ ఉదారస్వభావంతో మరోమాటకు అవకాశం యివ్వకుండా అంగీకరించాడు.

మూడు నెలల తరువాత అసలు గుట్టు బయటపడింది. అవే ప్లాట్స్ అంతకు ముందే మరో ఇద్దరికి అమ్మేసినట్లు డాక్యుమెంట్స్ వెలుగులోకి రాగానే ప్రకాష్ శిలా ప్రతిమలా నిశ్చేష్టుడైపోయాడు. ఎవరికీ చెప్పుకోలేని గుండెకోతతో వ్యధ చెందుతూ వెళ్ళి బాలాజీని, శ్రీనుని కలిసాడు.

" ఈజిట్ అంతపని జరిగిందా, ఇంకా నయం, మేం కూడా డబ్బు కట్టేయలేదు. ఇప్పుడేం చేస్తావ్, ఆలస్యం చేయకుండా డబ్బడిగి పుచ్చేసుకో" అని చిటికి వేసినంత తేలిగ్గా చెప్పేసి తప్పుకున్నారిద్దరూ బాలాజీ, శ్రీను.

మిత్రుడనే నమ్మకానికి, విలువలకి పట్టిన దుర్గతికి నిలువెల్లా కృంగిపోయాడు ప్రకాష్.

స్నేహానికున్న అనుబంధం, గౌరవం తుత్తునియలై పోతున్నాయనే బాధపడుతూ ప్రకాష్ భుజం తట్టి రెండు ఓదార్పు మాట్లాడాడు సంజీవ్.

ఆతరువాత ఆరునెలలు గడిచాయో లేదో ఆ గాయం యింకా పూర్తిగా నయం కాకుండానే బాలాజీ, శ్రీను కలసి సంజీవ్ దగ్గరకొచ్చారు. ప్రకాష్‌తోనే వారికి పని పడిందని మరీ చెప్పారు. జరిగిందాన్ని మరిచిపోకపోయినా ఇంటికొచ్చిన స్నేహితుల్ని పరామర్శించకుండా వుండలేకపోయాడు.

శ్రీను మెల్లగా చెప్పాడు. " నీకు తెలుసుకదరా, ఇంటిమీద మూడు లక్షల అప్పుంది. చక్రవడ్డీలతో అది నాలుగుకు చేరింది. ఆఫ్ పోర్షన్ ఇల్లు సేల్ చేయాలనుకుంటున్నాను. నీ హెల్ప్ కావాలి " అంటూ తన బాధను వ్యక్తం చేసుకున్నాడు. సంజీవికి సానుభూతి కలిగింది. విచారం ప్రకటిస్తూ " ఎంతో శ్రమపడి కట్టించావ్, అమ్మేస్తే తిరిగి కొనలేవు. ఒకటికి పదిసార్లు బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో" అన్నాడు సంజీవ్.

" లేదురా, తప్పనిసరి పరిస్థితి. ప్రకాష్‌కి ఎవరో దగ్గర చుట్టం. ఈ వూళ్ళో చిన్న ఇల్లొకటి కావాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. నువ్వో మాట చెపితేసరి, నా కష్టాలన్నీ గట్టెక్కిపోతాయి."అంటూ శ్రీను మిత్రుడు సంజీవ్ మీద భారం మోపాడు.

ఓ రోజు ప్రకాష్ బంధువులు ఇల్లు కొనే వేటలో వుండగా సంజీవ్ కల్పించుకొని శ్రీను ఇల్లు చూపించాడు. చిన్న కుటుంబానికి తగ్గట్టుగా సౌఖ్యంగా వుంది. అందరికీ నచ్చింది.

" ఇల్లంతా పది లక్షలకి అడుగుతున్నారు. యింతలో మీరొచ్చారు." అంటూ శ్రీను తన మాటలో ఏదో వ్యత్యాసం కనపరిచాడు.

సంజీవ్ భృకుటి ముడుస్తూ శ్రీను నైజం ఏదో బయటపడినట్లు అనుమానంగా చూసాడు. మళ్ళీ ఏదో యిరకాటంలో పెడుతున్నాడనిపించింది.

"శ్రీను నామాట విను, మన ఫ్రెండ్షిప్ ఎంతో విలువైనదని మరిచిపోవద్దు. ప్రకాష్ మనకెంతో, అతని బంధువులూ అంతే. ఎవరూ నష్టపోకూడదు. అందరికీ నచ్చేటటు ఓ మాట చెప్పు" అని ఎంతో చొరవ తీసుకున్నట్లు చెప్పాడు సంజీవ్.

చివరికి సగం ఇల్లు నాలుగున్నర లక్షలకే రేటు చెప్పాడు సంజీవ్. ఖరారు చేసాడు శ్రీను. ప్రకాష్ ఎంతో సంతోషించాడు. సంజీవ్ కూడా, తన మాటకు విలువనిచ్చినందుకు శ్రీనుని పొగిడాడు. ఓ మంచిరోజు చూసుకొని ఒప్పందాలు కుదర్చుకుని లక్ష రూపాయలు అడ్వాన్సుగా పుచ్చుకున్నాడు శ్రీను.

అది జరిగి నేటికి మూడు నెలలు గడిచింది. ఉదయాన్నే ప్రకాశం ఇంటి తలుపులు తట్టాడు. మా అబ్బాయి అతని హడావిడి చూసి నా పూజగది కొచ్చి నాధ్యానాన్ని భంగపరిచి

అతని ముందు నిలబెట్టాడు. ఇంటిల్లిపాదిని హడలగొట్టడమెందుకని, నేనే దుస్తులు వేసుకొని వీధిలో కొచ్చాను. దగ్గరలో వున్న పార్కులోకి తీసుకొస్తుంటే ప్రకాశం అసహనంగా "ఇక్కడ కూర్చుందాము. నీతో ఒక అర్జంట్ విషయం చెపుదామని వచ్చాను." అన్నాడు సేదతీరిన వాడిలా కూర్చుంటూ

"ఏంటో చెప్పు, అంత ఎమర్జన్సీ అయితే ఫోన్ చేయొచ్చుకదా"

అని విసుక్కుంటున్న నన్ను చూసి "శ్రీనివాస్ ఇల్లు రిజిస్ట్రేషన్ దగ్గర ఆగిపోయింది" అన్నాడు విచారంగా ప్రకాశం.

అది విని ఆశ్చర్యచకితుడు అయ్యాను

"ఏం జరిగింది, వివరంగా చెప్పు"

"ఏదో జరిగింది లే! శ్రీనివాస్ ఇల్లు కొనడానికి, అమ్మడానికి లంకె కుదరదని పట్టా భూమిని మా వాళ్ళు తోసి పుచ్చారు. డబ్బువాపసు యిమ్మని అడుగుతున్నారు. నాకేం తోచక నీ దగ్గరకొచ్చాను " అన్నాడు హృదయవిదారకంగా ప్రకాశం.

నాకొక ప్రక్క ఆశక్తత, మరో ప్రక్క ఆవేశం, బాధ కలిగాయి. శ్రీనివాస్ ఇంటి లోకాల్ట్‌లో అత్యధికులు ఉన్నతాధికారులు. వాళ్ళంతా యిలాగే కొనుక్కున్న వారు. అమ్ముకుంటున్నవారున్నారు. ఇందులో మోసం, దగా ప్రసక్తే లేదు. అయినా ఒకమారు అనుమానమొచ్చి ఒప్పందం "బెడిసికొడితే మళ్ళీ ఒప్పించడం సమాధాన పరచవలసిందింకేమీ లేదు.

"ఇచ్చిన అడ్వాన్స్ లక్షా తిరిగిచ్చేస్తే వాళ్ళింకెక్కడన్నా కొనుక్కుంటారు, ఈ మాట సహాయం చేసి పెడుదూ... నాకిప్పుడనిపిస్తోంది కష్టాల పాల్జేసేవాడు కూడా స్నేహితుడేనా?" అని ప్రకాశం చిన్న చురక అంటించాడు ఏదో ఒకటి తేల్చమని నన్ను బరిలోకి దించాడు. అయోమయపరిస్థితిలో పడ్డాను. ప్రకాశాన్ని సర్దిచెప్పి, శ్రీనివాస్‌ని కలసి జరిగిదంతా చెప్పాను. అబ్బె మొండిఘటం. అంతా తనదే రైటన్నట్లు మాట్లాడాడు. ఇలాంటి విషయాల్లో ఒప్పందం చాలా పటిష్టమైనది. అది వీగిపోతే అడ్వాన్సుగా పుచ్చుకున్న డబ్బు తిరిగి యివ్వడం జరిగేపనికాదు. అది అన్ని వేళలా అందరికీ వర్తించేదే!

"ఈ ఇల్లు నేనెందుకు అమ్ముకున్నానో నీకు తెలుసుకదా చేసిన అప్పులు, చక్రవడ్డీలు తీర్చుకోవాలి. ఎగ్రిమెంట్ జరిగి నాలుగు నెలల తరువాత వెనకడుగువేస్తే నాకేమీ

సంబంధం లేదు. నేను మళ్ళీ మరో పార్టీని వెతుక్కోవాలి. నాకెంత కష్టం" అంటూ తనని తాను సమర్ధించుకున్నాడు.

నా మనసు చివుక్కుమంది. స్నేహితులమన సంగతే మరిచిపోయి తనకనుకూలంగా చెపుతుంటే నానోటికి కళ్ళెం పడ్డట్లయింది. ఎవరినీ సర్ది చెప్పడం కుదరదు.

"ప్రకాశం మనకెంతో ఆప్తుడు, సన్నిహితుడు, ఇంట్లో వాళ్ళకి ఎలా చెప్పాలో, ఏం , చేయాలో తోచక యమయాతన పడుతున్నాడు. అడ్వాన్స్ అమౌంట్ తిరిగిచ్చేస్తే మంచిది." అన్నాను నా కడసారి ప్రయత్నంగా, ఏమైనా మారతాడమేనని, ఇద్దరికీ చాలాసేపు ఆ విషయం మీద సీరియస్‌గానే చర్చ జరిగింది. "నువ్వింతగా చెపుతున్నావు కాబట్టి మన స్నేహ బంధాలు చెదిరిపోకుండా వుండాలంటే నువ్వో సహాయం చేయి, నేనోపాయం చెప్తాను" అన్నాడు శ్రీనివాస్. ఏదో నీచమైన, నికృష్టమైన మెలికే పెడుతున్నట్లు నా సిక్త్ సెన్స్ చెపుతూనే వుంది.

"ఏంటో, చెప్పు"! చిరాకుగా అడిగాను

"ఏముంది, మా కంపెనీలో మీ అబ్బాయికి ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నావ్, ఇదివరకు నన్నడిగావు కూడా మామూళ్ళతో జరిగే పని కాదు కదా! అదంతా నేను చూసుకుంటాను. ప్రకాశం నువ్వు చెప్పిన మాట వింటాడు, నిష్కర్షగా చెప్పు అతడిచ్చిన లక్షా నెలనెల కట్టే చక్రవడ్డీకే చెల్లిపోతుందని, యిచ్చిన బయానా తిరిగిచ్చే సంప్రదాయం, ఎప్పుడు, ఎక్కడా వుండదు కావున అధిక నష్టం శ్రీనివాస్‌కే జరిగిందని, నచ్చజెప్పి, ఒప్పించు. మీ వాడికి ఉద్యోగము వస్తుంది. నాతో చేసుకున్న ఒప్పందము వీగి పోతుంది. ఏమంటావ్" అంటూ శ్రీనివాస్ నిర్భీతిగా చెప్పుకొచ్చాడు.

నా నోరు మూయించడానికి దుర్మార్గమైన ఆలోచనలతో నమ్మకద్రోహం తలపెట్టాడు.

నా ఒళ్ళు గగుర్పొడిచింది. తలకొట్టేసినంతపనైంది. ఒంట్లో రక్తం సలసల కాగింది. కోసంతో విరుచుకుపడ్డాను. నువ్వింత దగా చేస్తావనుకోలేదు. యింతకాలం నీ స్నేహానికెంతో విలువిచ్చాను. ఇదివరకోసారి బాలాజీ నువ్వూ కూడా ప్రకాశాన్ని నమ్మించి మోసం చేసారు. గుర్తుందా? మీ స్వలాభం కోసం అతని చేతి చమురు వదిలించారు. అసమర్ధుడై ఆ డబ్బు వసూలు చేసుకోలేక నష్టానంతటినీ భరించారు. అప్పుడు మీ రిద్దరూ ముఖం చాటేసారు. మళ్ళీ యిప్పుడు కూడా అతన్ని యిరుకులో పెట్టి మోసం చేద్దామనుకుంటున్నావ్, ఈ నాలుగునెలలకే నీ ఇల్లు అరిగిపోయిందా, తరిగిపోయిందా,

ఎవరూ కొనుక్కోరా? రోజురోజుకి నీ ఆస్తి విలువ పెరిగిందే కాని తరిగి పోవడం లేదు. అతనిచ్చిన అడ్వాన్సు వడ్డీ క్రింద అది నీవు తీసుకున్న అప్పులకి, జమ కట్టుకోవడం అమానుషం, అక్రమం, అన్యాయం!

" మిత్రులమై వుండి ఒకరి పట్ల వొకరికి ఎటువంటి సన్నిహితం వుందో యిప్పుడిప్పుడే పూర్తిగా అర్థమవుతోంది. డబ్బొక్కటే జీవిత పరమార్థం కాదు"అంటూ దురుసుగా లేస్తూ చీదరించుకుంటూ వెనుదిరిగాను.

శ్రీనివాస్‌కి మౌనమే శరణ్యమైనట్లుంది. నా మాటలు ఇనుప శూలాల్లా గుచ్చుకుంటున్నా ఏమాత్రం ఛలించలేదు. స్వార్థమంత నీచమైందని.

ఎప్పటికైనా నాకో మంచిమిత్రుడు ప్రకాశం ఒక్కడైనా మిగిలివున్నాడనుకున్నాను. స్నేహహస్తాలు అందిస్తాడనుకున్నాను. కాని, విచిత్రం అతడు కూడా నన్ను స్వార్థపరుల జాబితాలోకి నెట్టేసి, దూరమై పోవడం స్నేహానికున్న విలువలు అర్థం కాకుండాపోయాయి.

ఆలిండియా రేడియో, 2008

విశాఖపట్నం